క్లుప్తంగా

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

ఆస్పరి: మండలంలోని శంకరబండ బస్టాప్ సమీపంలో సోమవారం ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు మేరకు ఆస్పరి గ్రామానికి చెందిన రామలింగప్ప, నాగమ్మ ఆదోని నుంచి స్వగ్రామైన ఆస్పరికి ఆటోలో వస్తుండగా శంకరబండ బస్టాప్ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మారెప్ప, నాగమ్మ, రామలింగప్పకు గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

గోనెగండ్ల: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంఈఓలు రామాంజనేయులు, నీలకంఠ పిలుపునిచ్చారు. ఎస్టీయూ వజ్రోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న ఆధ్వర్యంలో ఎంఈఓలు, హెచ్ఎం నాగభూషణం చేతుల మీదుగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తిమ్మన్న మాట్లాడుతూ.. ఎస్టీయూ వజ్రోత్సవాల సందర్భంగా లక్ష మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్రుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మద్దికెర: రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది పోలింగ్ కేంద్రాల ఓటర్ల వద్దకు వెళ్లి ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలి, వేసిన తరువాత ఎవరికి ఓటు వేశామో తెలుసుకునేందుకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లను చూపించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. వీఆర్వో హర్షవర్ధన్, వీఆర్ఏలు సురేంద్ర, విజయలక్ష్మి, దామోదర్, కోదండ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో సోమవారం పశు వైద్యశిబిరం ఏర్పాటు చేసి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి కృష్ణానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 200 గేదెలు, ఎద్దులు, ఆవులకు టీకాలు వేసినట్లు చెప్పారు. ముందస్తుగా టీకాలు వేయడం వల్ల పశువులకు వ్యాధి సోకకుండా నివారించవచ్చన్నారు. పాడి రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. ఏహెచ్ఏలు శ్వేతారాణి, భారతి, గోపాలమిత్ర లక్ష్మన్న పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన

మద్దికెర: మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలకు సోమవారం ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని బెస్త కాలనీలో, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం వెనుక రూ.70 లక్షలతో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామని వెల్లడించారు.

సామాజిక తనిఖీ గ్రామసభలు

తుగ్గలి: మండలంలోని గిరిగెట్ల, మారెళ్ల, తుగ్గలి, కడమకుంట్ల, రాతన గ్రామాల్లో సోమవారం సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. తనిఖీ బృందాలు ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో గుర్తించిన అంశాలు, కూలీలకు చెల్లించిన వేతనాలపై గ్రామ సభల్లో చదివి వినిపించారు. ఏపీఓ రామకృష్ణ గ్రామ సభలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రాంపల్లి సర్పంచ్ మనీంద్ర, సర్పంచ్, గౌరవ సలహాదారు సుధాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు లింగన్న, కార్యదర్శి పక్కీరప్ప, ఉపాధి సిబ్బంది రఘురామిరెడ్డి, రాజు, బాలు, రమేష్, నరసింహ, సురేష్, చంద్ర పాల్గొన్నారు.

హత్య కేసులో విచారణ

తుగ్గలి: రెండు రోజుల క్రితం పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో జరిగిన పూజారి రాము హత్య కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఒకే తరహాలో ఏడాదిలోపు జరిగిన రెండు హత్యలపై ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మరోమారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై గ్రామస్తుల నుంచి ఆరా తీశారు. పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున వెంట ఉన్నారు.

పండుటాకులకు పింఛన్ భరోసా

- పింఛన్లు పెంచి ఠంచనుగా ఇస్తున్న ఘనత జగనన్నదే
- టీడీపీ హయాంలో లబ్ధిదారుడు చనిపోతేనే మరొకరికి పింఛన్
- వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత ఉంటే ఇంటివద్దకే పంపిణీ



కృష్ణగిరిలో పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



హాజరైన పింఛన్‌దారులు

కృష్ణగిరి/మద్దికెర: ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని పెంచడంతో పాటు అర్హులైన వారందరికీ ప్రతినెలా 1వ తేదీన పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కుతుందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. సోమవారం కృష్ణగిరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో, మద్దికెరలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణితో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి సీఎం జగనన్న అండగా ఉన్నారన్నారు. పేదవారి అభివృద్ధి కోసం సీఎం జగనన్న కృషి చేస్తుంటే, మాజీ సీఎం చంద్రబాబు అవినీతి, బినామీల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరవేర్చారని, చంద్రబాబు 600 హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. టీడీపీ పాలనలో పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుడు చనిపోతేనే మరొకరికి కొత్తగా పింఛన్ అవకాశం వచ్చేదని, నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులందరికీ రూ.3 వేల పింఛన్ ప్రతినెలా 1వ తేదీన ఇంటివద్దకే అందిస్తున్నామని గుర్తుచేశారు. మండలంలో 4,870 మందికి పింఛన్ ఇస్తుండగా కొత్తగా 118 మందికి పింఛన్లు మంజూరు చేశారని చెప్పారు.

టీడీపీ వారికి కూడా పింఛన్లు

వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. ప్రస్తుతం కొత్తగా మంజూరైన పింఛన్లలో టీడీపీకి చెందిన వారే ఎక్కువగా ఉన్నారన్నారు. గతంలో పింఛన్లు రావాలంటే జన్మభూమి కమిటీ సభ్యులకు కానుకలు సమర్పించాల్సి ఉండేది. ఇప్పుడు అర్హత ఉంటే ఎవ్వరినీ సంప్రదించకుండగానే నేరుగా పింఛన్ వస్తుందని వివరించారు. ఫ్యాక్షన్ వీడాలని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అని ఇంట్లో మనిషిని పోగొట్టుకుంటే ఎంతో బాధ ఉంటుందో అనుభవిస్తున్నానన్నారు. ప్రతిపక్ష నాయకులకు కూడా మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నానన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, ఎంపీడీఓలు రామస్వామి, నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం, డీటీ నాగరాజు, పార్టీ నాయకులు అంకాల మహాలక్ష్మి, లక్ష్మీకాంతరెడ్డి, నక్కషాలు, సుశీల, రాజేష్, మాధవరావు, బ్రహ్మనందరెడ్డి, జయరామిరెడ్డి, ప్రహ్లాద, పక్కీరప్ప, ఆంజనేయులు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లోనే పింఛన్ మంజూరైంది



నా భర్త అనారోగ్యంతో రెండు నెలల కింద చనిపోయాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో చాలా కుంగిపోయాను. అయితే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు నా భర్తకు సంబంధించి డెత్ సర్టిఫికెట్ తీసుకొస్తే పింఛన్‌కు దరఖాస్తు చేస్తామని చెప్పారు. వెంటనే దరఖాస్తు చేసుకున్నా రెండు నెలల్లోనే కొత్త పింఛన్ మంజూరు చేసి నగదు ఇచ్చారు. పింఛన్ సొమ్ముతో మా కుటుంబానికి భరోసా కల్పించారు. జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– ఉలువ అంజినమ్మ, చిట్యాల

జీవితానికి భరోసా కల్పించారు



నేను తాపీమేస్త్రీ పని చేస్తూ కుటుంబానికి ఆసరా ఉండేవాడిని. పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి మూడు అంతస్తుల పైనుంచి కిందపడ్డాను. వెన్నుపూస దెబ్బతిని వైకల్యం బారిన పడ్డారు. సదరంలో దరఖాస్తు చేసుకోగా 70 శాతం వికలత్వం ఉన్నట్లు సర్టిఫికెట్ వచ్చింది. దీంతో వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా వెంటనే మంజూరైంది. పింఛన్ సొమ్ముతో నా జీవితానికి భరోసా వచ్చింది.

– వీరబోయిని శివప్రసాద్, కటారుకొండ

ఏంఈఓ విరాళం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి ఎంఈఓ– 2 మధుసుదన్‌రాజు భార్య టీవీ.ప్రసన్నలక్ష్మి జ్ఞాపకార్థం రూ.30 వేల విలువైన అడ్జస్టబుల్ డబుల్ మంచం, వీల్ చైర్‌ను సోమవారం విరాళంగా అందజేశారు. వేదాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సునీల్‌కుమార్, పలు విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

చిప్పగిరి: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్ర, జగనన్న ఆరోగ్య సురక్ష, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, జన్ భాగీదారి తదితర కార్యక్రమాలపై ఎంపీడీఓ కొండయ్య స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం జగనన్న ఆరోగ్య సురక్ష పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు నారాయణ స్వామి, సిసింద్రి, జయరాం నాయక్, నరేంద్ర, సుధీర్, సురేంద్ర, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గంజాయి, మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నాయని, వాటిని అరికట్టాలని పలు విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు డీఎస్పీ సీతారామయ్యను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయా సంఘాల నాయకులు రాజేష్, ఉదయ్, ఖదిర్, ఇస్మాయిల్, సురేష్ తదితరులు డీఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

పింఛన్.. ఆనందం పెంచెన్



కనకవీడులో పింఛన్ పంపిణీ చేస్తున్న లక్ష్మీకాంత రెడ్డి



నేమకల్లులో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ మౌలా



నేలతలమరి గ్రామంలో పింఛన్ అందజేస్తున్న హంపిరెడ్డి

నందవరం: ప్రభుత్వం అందిస్తున్న రూ.3 వేల పింఛన్ అవ్వాతాతల మోములో ఆనందం నింపిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీ కాంత రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో సర్పంచ్ మద్దీశ్వరి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే గురజాల గ్రామ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరమేష్, చిన్న నరసింహులు పింఛన్లు పంపిణీ చేశారు.

చిప్పగిరి: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం 3వ రోజు కొనసాగింది. వేకువజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛనసొమ్ము అందజేశారు. మండలంలో 95% పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ కొండయ్య తెలిపారు.

దేవనకొండ: మండలంలోని నేలతలమరి గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ సలహా చైర్మన్ హంపిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నూరు శాతం అమలుపరిచిన మొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా సూర్యోదయానికి ముందే తలుపు తట్టి పింఛన్ ఇచ్చే విధానం తీసుకొచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించుకుందామని పింఛన్‌దారులను కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాం, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నారాయణ ఉన్నారు.

10న కేంద్ర మంత్రి రాక



పగిడిరాయిలో మైదానాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

హొళగుంద: కేంద్ర మంత్రి ఎస్‌పీ సింగ్ బఘేల్ ఈ నెల 10న గజ్జహళ్లి గ్రామ పర్యటన సందర్భంగా సోమవారం తహసీల్దారు హుసేన్‌సాహెబ్, ఎంపీడీఓ సుహాసిని, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తదితరులు గ్రామంలో ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక పోతులింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్, పంచాయతీ సెక్రటరీ రంగస్వామి, గ్రామపెద్దలు గిరిమల్ల తదితరులు ఉన్నారు.

తుగ్గలి: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఈనెల 11న పగిడిరాయి గ్రామానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌పీ సింగ్ బఘేల్ రానున్నారు. ఈ మేరకు సోమవారం జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి, ఇతర శాఖల అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

నేడు బేవినహాల్‌లో సురక్ష వైద్య శిబిరం

హాలహర్వి: మండలంలోని బేవినహాల్ గ్రామంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంతోని తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ శిబిరంలో వైద్యాధికారులు పాల్గొని రోగులకు వైద్య చికిత్సలు అందించి, ఉచితంగా మందులను పంపిణీ చేస్తారన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న శిబిరానికి తరలివచ్చి వైద్యసేవలు పొందాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో లోపాలు రానీయొద్దు

ఆలూరు: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఏఈ, ఎల్ఐ, జేఎల్ఎంలు చర్యలు తీసుకోవాలని ఆలూరు విద్యుత్ శాఖ ఏడీఈ నాగేంద్రుడు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఏడీఈ కార్యాలయంలో సోమవారం వివిధ మండలాలకు చెందిన విద్యుత్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఏడీఈ మాట్లాడుతూ.. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటిని మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. కేటగిరీ-1, 2 కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉంచకుండా బిల్ కలెక్టర్లు వసూలు చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అడ్డదిడ్డంగా పెరిగిన ముళ్ల కంపలు, తీగ మొక్కలను తొలగించాలని సూచించారు.

పార్టీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానానికి పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని సమష్టి కృషితో గెలిపించుకుంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేశన్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్ తదితర ప్రజాప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తన కుమారుడి పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యానని, అయితే కొన్ని పత్రికలు, మీడియాలో బీసీ కులానికి చెందిన వ్యక్తి మాచాని వెంకటేష్‌ను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై అసంతృప్తితో ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేయడాన్ని ఖండించారు. పార్టీ సమన్వయకర్తకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కోటేకల్ గ్రామ సర్పంచ్ లక్ష్మన్న మాట్లాడారు. వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, సర్పంచులు వెంకట్రామిరెడ్డి, రంగస్వామి, కౌన్సిలర్ వాహిద్, కేశవరెడ్డి, నటరాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: జనవిజ్ఞాన వేదిక ఆధర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ పోటీల్లో పట్టణంలోని వీవర్స్ కాలనీ హైస్కూల్ విద్యార్థులు మురళీ సాత్విక్, ప్రేమ్‌గణేష్, భరత్‌పుత్రారెడ్డి మొదటి స్థానం సాధించినట్లు హెచ్ఎం నాగభూషన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు నిర్వాహకులు మొమెంటోలతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆయా విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కార్యకర్తల సమవేశం

ఆలూరు: నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం మంగళవారం ఆలూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొంటారని నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ పరిధిలోని కాలువ వద్ద సోమవారం రాత్రి పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఓ వ్యక్తి బైకుపై కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులను చూసి మోటార్ సైకిల్, కర్ణాటక మద్యాన్ని వదిలేసి పరారైనట్లు ఎస్ఐ చెప్పారు. సదరు వ్యక్తి బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ (ఏపీ21ఏజీ 9998), 90 ఎం.ఎల్. పరిమాణం గల 125 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు వివరించారు.

గ్రామాలపై ప్రత్యేక నిఘా

కృష్ణగిరి: సంక్రాంతికి ఎవరైనా కోడి పందేలు వేసినా, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన వివిధ గ్రామాల ప్రజలతో మాట్లాడారు. పండుగ నేపథ్యంలో గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే అలాంటి వారిని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. చిన్న, చిన్న సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని, గొడవలు పడి పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరిగి కాలాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు.



కనకవీడులో క్రీడాదుస్తులు అందజేస్తున్న లక్ష్మీకాంత రెడ్డి

క్రీడాదుస్తుల పంపిణీ

నందవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం- ఆంధ్ర క్రీడా కార్యక్రమం గ్రామీణ క్రీడాకారులకు ఓ వరమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కనకవీడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ మద్దీశ్వరి నేతృత్వంలో క్రీడాకారులకు టీ షర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో క్రీడకారుల నైపుణ్యం గుర్తించేందుకే ప్రభుత్వం ఈ పోటీలకు శ్రీకారం చుట్టిందన్నారు. యువత క్రీడల్లో రాణించాలన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌రెడ్డి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి పోటీలకు ఏర్పాట్లు

ఆలూరు: మండల స్థాయిలో 'ఆడుదాం - ఆంధ్ర' క్రీడాపోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ అల్లబకాష్ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీడీ, పీఈటీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీ నుంచి క్రీడాపోటీలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మైదానాల్లో క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే క్రీడాకారులకు తాగునీరు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. పీడీ కవిరాజ్, పీటీ గుత్తినాగరాజ్, చిన్న బాబు, హనుమంతరెడ్డి తదితరులు ఉన్నారు.

రస్తా ఆక్రమణను అరికట్టండి

హొళగుంద: స్థానిక వాల్మీకి సర్కిల్ వద్ద ఉన్న తెక్కలకోట రస్తా ఆక్రమణను అరికట్టి పంట పొలాలతో పాటు తమ ఇళ్లకు తిరిగేందుకు అవకాశం కల్పించాలని అయ్యప్పస్వామి ఆలయ పరిసర వాసులు, రైతులు కోరారు. సోమవారం సిద్దప్ప, హుసేన్‌పీరా, సిద్దిక్‌సాబ్, బాషా తదితరులు ఆర్ఐ దినోజ్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డులో ఆక్రమణలు పెరిగితే అటు వైపు తిరిగే రైతులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. అందరికీ ఉపయోగకరంగా ఉన్న రస్తా ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.

కరువు మండలంగా ప్రకటించాలి

పత్తికొండ రూరల్: తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని కోరుతూ సోమవారం అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ రామలక్ష్మికి వినతి పత్రం అందజేశారు.

రెండు గ్రామాల్లో వికసిత్ యాత్ర



మారెళ్లలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

తుగ్గలి: మండల పరిధిలోని మారెళ్ల, రామకొండలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి పంచాయతీ కార్యదర్శి అంకాలప్ప ప్రజలకు వివరించారు. క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్య బృందం రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకరరెడ్డి, లింగన్న, మద్దిలేటి, బాలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆస్పరిలో క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

ఆస్పరి: ఆస్పరిలో సోమవారం 2024 సంవత్సరానికి సంబంధించి సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ క్యాలెండర్‌ను అభిమానులు వీర, రవి, నాగేంద్ర, మహానంది, నరసప్ప, మురళి, గోవర్ధన, వీరేష్, వెంకటేష్ విడుదల చేశారు. జూనియర్ ఎన్టీఆర్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు చెప్పారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఈరన్న స్వామి క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాలతో నుంచి వచ్చిన భక్తులు స్వామి వారి సన్నిధిలో మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, ఆకు పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి

నందవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంతరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కనకవీడు గ్రామ సచివాలయంలో జన్ భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి లక్ష్మీకాంతరెడ్డి, గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్యానర్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాజకీయంగా ఎదిగేందుకు ప్రతి వర్గానికి ప్రాధాన్యత ఇచ్చారని, ముఖ్యంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి ఆదర్శంగా నిలిచారన్నారు. పంచాయతీ కార్యదర్శి రామారావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.